


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

06.08.2026

గురువారం| రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 37

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## అర్హులకు అన్యాయం జరగనివ్వం

- 22ఏ భూముల పరిష్కారానికి తుది గడువు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ జాబితాలో చేర్చలే
- ప్రైవేట్ భూములను నిషేధించారనే ప్రచారం అవాస్తవం

2లో..



**హైదరాబాద్, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వల్ల ఏ ఒక్క అర్హులైన పేదవాడికి, నిజమైన భూహక్కుదారుడికి అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ జాబితాలో చేర్చలేదని, ప్రైవేట్ భూములను నిషేధించారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పారు.

## ప్రపంచ డిజిటల్ ఎకానమీలో.. యువత భాగస్వామ్యం కావాలి

- మంత్రి లోకేశ్ పిలుపు
- సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రం
- ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటు



2లో..

**అమరావతి, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

# ఢిల్లీ రేవంత్ బిజీ.. బిజీ

- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపు!
- కేంద్రం జోక్యం కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- మహారాష్ట్ర అనుమతులు వచ్చేలా చూడాలి
- 152 మీటర్ల ఎత్తుతో ముంపు ఉండదని స్పష్టత
- జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు..
- సీఎం రేవంత్, ఎంపీలు కలిసి వినతిపత్రం అందజేత



**న్యూఢిల్లీ, ఆగస్టు 05, అనంతజనశక్తి న్యూస్**

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జలశక్తి శాఖకు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మాణంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్‌అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి వివరించారు.

**సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనం – ముంపు అంచనాలు**

CWPRS అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని తెలిపారు. ముంపులో 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని చెప్పారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా అవసరమైన నీటి సరఫరా సాధ్యం కాదని, అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి కోరారు.

**గ్రావిటీ నీటి సరఫరా – విద్యుత్ భారం తగ్గుదల**

తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరా వల్ల విద్యుత్ వినియోగ భారం తగ్గుతుందని వివరిస్తూ, ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి ఏర్పడుతుందని వివరించారు.

**కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో చర్చలకు హామీ**

ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని జలశక్తి మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు**

ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు

- హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి
- అధికారంలో ఉన్న ఏ రోజూ..
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



2లో..

**హైదరాబాద్, ఆగస్టు 05, అనంత జణశక్తి న్యూస్**

తెలంగాణ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పరోక్షంగా ఆ రాష్ట్ర ప్రాజెక్టులకు మద్దతిచ్చిందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

## ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు

- చంద్రబాబు పాలనతో రోడ్డున పడ్డారు
- రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది
- వైసీపీ అధ్యక్షుడు పవన్
- తూర్పు గోదావరి జిల్లాలో పర్యటన

2లో..

## నాకు 8 సెకన్‌లలో నిద్రపడుతుంది

ఎన్డీయే రాజ్యసభ సభ్యులతో ప్రధాని మోదీ

2లో..



## ఒక్కో మనిషిపై ఉన్న అప్పు 2 లక్షలు

- వైఎస్ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు
- చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీ లేదు
- మేనిఫెస్టోకు మంగళంపాడేసి..

2లో..

**అమరావతి, ఆగస్టు 05, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విడుదల చేసిన శ్వేతపత్రం 2024-26 ప్రగతి నివేదికపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు అబద్ధాన్ని అందంగా చెప్పడంలో సీఎం చంద్రబాబు ఘనాపాటి అంటూ ధ్వజమెత్తారు. కూటమి రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టు ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్ అంటూ ఎద్దేవా చేశారు.

## సమ్మక్క సాగర్ ప్రాజెక్టుపై కుట్ర జరుగుతోంది

- హరీశ్‌రావు సంచలన ఆరోపణలు
- అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదు
- అజెండా వచ్చి వారం రోజులు గడిచినా..
- ఎవరూ మాట్లాడటం లేదని ఫైర్

2లో..



## సంయమనంతో ఉండాలి

- జెన్ జీ నిరసనలపై సుప్రీం కోర్టు
- రాళ్లు విసిరినా కఠినంగా వ్యవహరించొద్దు
- కౌన్సెలింగ్ ఇచ్చి శాంతింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత

2లో..

## 'చట్టం'తో బీసీలకు రక్షణ

- మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు
- బీసీలకు మరో ఎన్నికల హామీని నెరవేర్చుతున్నాం
- బీసీ రక్షణ చట్టానికి తుదిరూపు ఇస్తున్నాం
- దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్న ఏపీ : సవిత
- బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠిన చర్యలు




2లో..

**విజయవాడ ఆగస్టు 05, అనంత జనశక్తి ప్రతినిధి**

బీసీ రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో జిల్లా స్థాయిలోనూ బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు.

## పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై క్లారిటీ ఇవ్వాలి

- హరీశ్‌రావుకు మహేశ్ గౌడ్ సవాల్
- పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా
- ఎందుకు గోప్యంగా ఉంచారు?

2లో..



**హైదరాబాద్, ఆగస్టు 05, అనంతజనశక్తి న్యూస్**

తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు.

# డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం పార్లమెంటు ప్రత్యేక సెషన్!



ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఆగస్టు 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రస్తుత సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంట్‌ను నిరవధికంగా వాయిదా వేయకపోవచ్చని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ప్రతిపాదిత సవరణలు ఆమోదం పొందేందుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అవసరమైన సంఖ్యా బలం సమకూరిన తర్వాత ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపాయి.

**రిజిజు అభ్యర్థనకు రాహుల్ నిరాకరణ**

పార్లమెంట్ వర్షా కాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడింది. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని ఆయన ఛాంబర్‌లో కలిశారు. డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులకు సహకరించాలని కోరారు. అయితే, కేంద్రమంత్రి అభ్యర్థనను కాంగ్రెస్ ఎంపీ తిరస్కరించారు.

అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ, సీజేపీ నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దుశ్చర్యలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన వెలువడే వరకు సభలో ఎలాంటి కార్యకలాపాలు జరగబోవని రాహుల్ స్పష్టం చేశారు. దీంతో పార్లమెంట్ ప్రతిష్టంభనపై చర్చించేందుకు కిరణ్ రిజిజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షాతో సమావేశమైనట్లు సమాచారం.

# వాహనంలో కూర్చున్న ఏ వ్యక్తికైనా బీమా చెల్లించాల్సిందే

- బీమాలేని వాహనాలకు ఇంధనం విక్రయించొద్దు
- కొత్త కార్లకు 4, ద్విచక్ర వాహనాలకు 6 ఏళ్లపాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ కొనుగోలు తప్పనిసరి చేయాలి
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనంలో కూర్చున్న ఏ వ్యక్తికైనా బీమా కంపెనీలు కాంప్రహెన్సివ్/ ప్యాకేజ్ పాలసీ కింద పరిహారం చెల్లించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. మోటారు వాహన ప్రమాదాల పరిహారానికి సంబంధించిన విషయాల్లో కోర్టులు అతి సాంకేతికత దృక్పథాన్ని (హైపర్ టెక్నికల్ అప్రోచ్) అనుసరించకూడదని నిర్దేశించింది. 1996 జులై 13న ప్రకాశం జిల్లా సింగరాయకొండ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన చిత్తూరు జిల్లాకు చెందిన టి.రాము అనే వ్యక్తి కుటుంబసభ్యులకు పరిహారం చెల్లించే విషయమై మంగళవారం వెలువరించిన తీర్పులో జస్టిస్ సంజయ్‌కరోల్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రల ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది.

దేశంలో పెద్ద సంఖ్యలో వాహనాలు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ లేకుండానే పరుగులు తీస్తున్నందున.. రిజిస్ట్రేషన్ సమయంలోనే కొత్తకార్లకు నాలుగేళ్లు, ద్విచక్ర వాహనాలకు ఆరేళ్లపాటు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కొనుగోలుచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని పేర్కొంది. బీమా అమల్లో ఉన్న వాహనాలకే ఇంధనం సరఫరా జరిగేలా ఐఆర్‌డీఏ పైలట్ ప్రాజెక్టును అమలుచేయాలని, కేంద్ర రహదారి రవాణా శాఖతో సంప్రదించి దీనిపై చర్యలు చేపట్టాలని సూచించింది. బీమా తీసుకునేంత వరకూ వాహనాలకు ఇంధన సరఫరా జరగకుండా చూడాలని ఆదేశించింది. మారుతి 800 కారును వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న రాము తీవ్రంగా గాయపడి తర్వాత చికిత్స పొందుతూ మరణించారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయినందుకు బీమా కంపెనీ నుంచి రూ.10 లక్షల పరిహారం ఇప్పించాలని కోరుతూ అతని కుటుంబసభ్యులు మోటారు వాహనాల చట్టం సెక్షన్ 166 కింద ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు.

అయితే వాహనానికి తప్పితే, వాహన యజమానికి సంబంధించిన వ్యక్తిగత రిస్క్‌ని కవర్ చేయడానికి ఎలాంటి అదనపు బీమా ప్రీమియం చెల్లించనందున పరిహారం కోరే అర్హత కుటుంబసభ్యులకు లేదంటూ ట్రైబ్యునల్ 2009లో తీర్పు వెలువరించింది. దాన్ని సవాల్‌చేస్తూ బాధితులు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించగా 2012లో వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది. మృతుడి ఆదాయానికి సంబంధించిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కోర్టు అతని నెలవారీ ఆదాయాన్ని నోషనల్‌గా రూ.4,500గా లెక్కించి 7.5% వడ్డీతో రూ.10,00,500 పరిహారం చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. ఆ కారుకు కాంప్రహెన్సివ్ బీమా పాలసీ ఉందని, అందులో ప్రయాణికుడిలా పయనిస్తున్న దాని యజమానికి జరిగే నష్టానికి కూడా అది వర్తిస్తుందని పేర్కొంది.

ఆ తీర్పును సవాల్‌చేస్తూ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ఇచ్చిన తీర్పునే సర్వోన్నత న్యాయస్థానం సమర్థిస్తూ బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. వాహన బీమాకు సంబంధించి తాము జారీ చేసిన ఆదేశాల అమలుపై అన్ని భాగస్వామ్యపక్షాలూ ఈ నెల 14 లోపు సమాధానం దాఖలుచేయాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ సందర్భంగా వాహన బీమాకు సంబంధించి ధర్మాసనం కొన్ని ఆదేశాలు జారీచేసింది.



బీమా లేని వాహనాలకు ఆటోమేటిక్‌గా ఈచలానాలు జారీచేయడానికి వీలుగా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, వాహన్ పోర్టల్‌తో అనుసంధానం చేయాలి. రియల్‌టైం ఇన్సూరెన్స్ స్టేటస్‌ను గుర్తించడానికి పోలీసులకు చేతిలో ఇమిడిపోయే పరికరాలు/ యాప్‌లు సమకూర్చాలి.

బీమాలేని వాహనం ఉపయోగించేవారిపై మోటార్ వాహన చట్టం 1988లోని సెక్షన్ 196 కింద కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు వాహనాలకు నాలుగు అంచెల బీమా విధానాన్ని అమలుచేయాలి. అందులో థర్డ్‌పార్టీ బీమా తప్పనిసరిగా అమలుచేయాలి. వాహనంలో కూర్చున్నవారు/పిలియన్ రైడర్‌స్‌కి పరిహార కవరేజి. యజమాని/డ్రైవర్/కూర్చున్నవారికి వ్యక్తిగత ప్రమాద కవరేజి.

బీమా చేసిన వాహనానికి అయ్యే నష్టాన్ని భర్తీచేసే కవరేజీలను ఆప్షనల్‌గా అమలుచేయాలి. వినియోగదారుడు బీమా కొనుగోలుచేసేటప్పుడు ఈ ఆప్షన్లతోకూడిన ఫామ్ అందించి వారు ఎంచుకున్న ఆప్షన్ల ఆధారంగా కవరేజి కల్పించాలి. ఒకవేళ ఇందులో ఇంకా ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలనుకుంటే ఐఆర్‌డీఏ ఆ మేరకు నిర్ణయం తీసుకోవచ్చు.

పైన పేర్కొన్న ఆప్షనల్ కవరేజి కోసం అమలుచేసే పాలసీలు అన్నింటిలో ఒకేతరహా పదజాలం ఉండేలా ఐఆర్‌డీఏ చర్యలు తీసుకోవాలి.

ఈ ఆప్షన్ల గురించి స్పష్టంగా తెలిసేలా వినియోగదారులకు ఐఆర్‌డీఏ సమాచార పత్రం అందించాలి. అందులో ఏవి తప్పనిసరి, ఏవి ఐచ్ఛికమో చెప్పాలి. మోటారువాహన బీమా విక్రయాల్లో ఈ నాలుగు ఆప్షన్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలి.

ప్రయాణించే, వస్తువులు రవాణా చేసే వాహనాలకు బీమా ఉందో లేదోనని తనిఖీ చేసుకునే అవకాశాన్ని ప్రజలకు కల్పించాలి. ఈ ఆదేశాల అమలుపై అన్ని భాగస్వామ్యపక్షాలూ ఈ నెల 14వ తేదీలోపు సమాధానం దాఖలుచేయాలని ఈ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది.

# సైబర్ మోసాల కట్టడికి 4 వారాల్లో నిబంధనలు

- మ్యూల్ ఖాతాలపై చర్యలకూ ప్రామాణిక మార్గదర్శకాలు రూపొందించండి
- ఆర్బీఐకి సుప్రీంకోర్టు దిశానిర్దేశం

ప్రజలను నిట్టనిలువునా ముంచేస్తోన్న డిజిటల్/ సైబర్ మోసాలను అరికట్టేలా అధికార యంత్రాంగాలను క్రియాశీలం చేస్తూ దేశమంతటికీ వర్తించే ఆదేశాలను సుప్రీంకోర్టు మంగళవారం జారీ చేసింది. ఈ మోసాలకు ప్రధాన కారణమవుతున్న బ్యాంకు ఖాతాలు, మ్యూల్ ఖాతాలపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ప్రామాణిక నిబంధనలను నాలుగు వారాల్లోగా సిద్ధంచేసి సర్క్యులేట్ చేయాలని భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ)కు స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల హైకోర్టుల రిజిస్ట్రార్స్ జనరల్‌కు ప్రామాణిక నిబంధనల తుది ప్రతిని పంపించాలని తెలిపింది.

ఆర్థిక మోసాలతో ముడిపడిన సైబర్ నేరాలపై సత్వరమే స్పందించి గట్టి చర్యలు తీసుకునేలా ఆయా యంత్రాంగాలను బలోపేతం చేయాలనీ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులపై దర్యాప్తు సంస్థలు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ విభాగాలూ చురుగ్గా వ్యవహరించడంతో పాటు బాధితులకు న్యాయంచేయాలని, వారు కోల్పోయిన డబ్బును తిరిగి వచ్చేలా చేయాలనీ తెలిపింది. సుప్రీంకోర్టు సుమోటోగా చేపట్టిన 'డిజిటల్ అరెస్టులు, నకిలీ పత్రాల బాధితులు' కేసు విచారణలో భాగంగా ధర్మాసనం ఈ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.



కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సమర్పించిన స్థాయీ నివేదికలపై సంతృప్తి వ్యక్తం చేసింది. సైబర్‌నేరాల కట్టడి చర్యల్లో పురోగతి ప్రశంసనీయమని తెలిపింది. సైబర్ నేరాల కట్టడి యంత్రాంగాల పరిధిని విస్తృతం చేయాలని, వాటి వేగాన్ని పెంచడంతో పాటు నిరంతర అనుశీలన అవసరమనీ సూచించింది.

కేంద్ర హోంశాఖ పరిధిలో 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్'ను అందుబాటులోకి తీసుకొచ్చి 'గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మాడ్యూల్', 'మనీ రెస్టోరేషన్ మాడ్యూల్'ను ఏర్పాటు చేయాలని ధర్మాసనం తెలిపింది. వీటి గురించి ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని పేర్కొంది. తద్వారా బాధితులు సత్వర న్యాయంపొందేలా చూడాలని పేర్కొంది. స్టేట్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్స్ ఏర్పాటు, ఈజీరో ఎఫ్ఐఆర్‌ల నమోదు విషయంలో 18రాష్ట్రాలు మాత్రమే చర్యలు తీసుకున్నాయని ధర్మాసనం పేర్కొంది.

# అనలాగ్ పనీర్‌పై మహారాష్ట్రలో నిషేధం..



- ఎలా తయారు చేస్తారో తెలుసా?

అనలాగ్ పనీర్‌తయారీ, విక్రయాలపై మహారాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే.. ఆరు నెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించనుంది. ఈ పనీర్ తినడం వల్ల మరణం సంభవిస్తే.. శిక్ష తీవ్రత పెరుగుతుందని వెల్లడించింది. యావజ్జీవ కారాగారశిక్ష, రూ.10 లక్షల జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. కల్తీపాల ఉత్పత్తుల అమ్మకాలను అరికట్టడమే లక్ష్యంగా ఆహార భద్రతా సంస్థ ఈ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఛత్తీస్‌గఢ్ తర్వాత అనలాగ్ పనీర్‌పై ఈ ఆంక్షలు విధించిన రెండో రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచింది. ఈ నిషేధం వార్తతో అసలు పనీర్, అనలాగ్ పనీర్‌కు మధ్య తేడా ఏంటని నెటిజన్లు చర్చిస్తున్నారు. తయారీలో వాడే వస్తువుల ఆధారంగా సాధారణ పనీర్‌తో పోలిస్తే ఇది చౌకగా లభిస్తుంది. ఇందులో పాలను ఉపయోగించరు. పామాయిల్ వంటి వెజిటేబుల్ ఆయిల్‌ను ఉపయోగిస్తారు. దాంతో పాటు స్టార్చ్, పాలపొడిని వాడుతుంటారు. చూడటానికి అసలు పనీర్‌వలే కనిపించినప్పటికీ.. దాంతో పోలిస్తే సగం ధరకే దొరుకుతుంది. దీనిగురించి వినియోగదారులకు సరైన సమాచారం ఇవ్వకుండా అసలైన పాల ఉత్పత్తి లాగే అనలాగ్ పనీర్‌ను విక్రయిస్తుండటంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ పరిణామాలతో నకిలీ పనీర్‌పై నెట్టింట ఆందోళన వ్యక్తమవుతోంది. మరి దాన్ని గుర్తించడమెలా..?

మొత్తంగా ఒకే రంగులో కాకుండా వివిధ రంగుల్లో ఉంటే స్వచ్ఛమైంది కాదని అర్థం. ముదురు పసుపు రంగులో ఉన్నా అనుమానించాల్సిందే. ఒక పనీర్ ముక్కను నలిపిచూస్తే.. కొద్దిగా మెత్తగా తగులుతుంది. రబ్బర్‌లా సాగిందంటే స్వచ్ఛత లేనట్లే.

స్వచ్ఛమైనదానికి కొద్దిగా పాల మిఠాయి వాసన వస్తుంది. అలా కాకుండా పుల్లటి వాసన వస్తే ఆలోచించాలి. పనీర్ ముక్కను నీళ్ల గ్లాసులో వేస్తే.. మునిగి, చెక్కుచెదరకుండా ఉండాలి. కల్తీది అయితే కరిగిపోతుంది లేదా విరుగుతుంది. పెనం మీద వేడి చేసినప్పుడు అసలైనది ఆకారం మారదు. కొద్దిగా తేమ బయటకు వస్తుంది. కల్తీ పనీర్ అయితే వేడిచేయగానే కరిగిపోతుంది. ఎక్కువ మొత్తంలో నీరు బయటకు వస్తుంది.

తక్కువ ధరకు లభించే పనీర్ ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైనంత వరకు ఇంట్లో తయారు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ20పై మోదీ నివాసానికి కేజ్రీవాల్ పాదయాత్ర



ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం వైపు ప్రదర్శనగా బయల్దేరిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మరో 100 మందిని ఢిల్లీ పోలీసులు మంగళవారం మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో వారు ఫిరోజ్ షా రోడ్డులో బైఠాయించి నిరసనకు దిగారు. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులు దీనిలో పాల్గొన్నారు. ఈ20 ఇంధనానికి వ్యతిరేకంగా ప్రజల నుంచి 2.30 లక్షల పిటిషన్లను ఆప్ సేకరించింది. ఇథనాల్ కలిపిన ఇంధనానికి వ్యతిరేకంగా ప్రజలను కేజ్రీవాల్ తప్పుదోవ పట్టిస్తూ, రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని భాజపా ఆరోపించింది.

## తీవ్ర వేదనలో దేశ విద్యార్థులు





దేశంలోని విద్యార్థులంతా తీవ్ర వేదనలో ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వారికి ఉపాధి కరవైందని, పరీక్షల్లో నిష్పాక్షికతను, సక్రమం గా పనిచేసే విద్యా వ్యవస్థను కోరుకుంటున్నారని తెలిపారు. 'విద్యార్థులను క్షమిస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటున్నారు.. నన్ను కానీ విద్యార్థులను కానీ క్షమించడానికి ఆయనెవరు? నాకు అర్థం కావడంలేదు. నన్ను, దేశ భవిష్యత్తు(విద్యార్థులు)ను క్షమించగలననే ఆలోచన ఆయనకు ఎక్కడ నుంచి వచ్చిందో?"అని రాహుల్ పేర్కొన్నారు. విద్యార్థులకు వ్యతిరేకంగా కేంద్రం పాల్పడిన తప్పలకు ప్రధాని క్షమాపణలు కోరాలని సూచించారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన మాజీ ఎంపీ వైగో రాసిన 'వైగో ఇన్ పార్లమెంటు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

## ఒక్కసారిగా 300 అడుగుల కిందకు!




థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానం మార్గమధ్యంలో తీవ్ర కుదుపులకు లోనైంది. అది ఒక్కసారిగా 300 అడుగుల ఎత్తును కోల్పోయింది. ఈ ఘటనలో 15 మంది గాయపడ్డారు. అందులో సిబ్బంది ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విచారణకు ఆదేశించింది. ఫుకెట్ నుంచి ఏ320 విమానం 134 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో మంగళవారం ఉదయం బయలుదేరింది. మార్గమధ్యంలో కుదుపుల కారణంగా 11 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఉదయం 11.30 గంటల సమయంలో విమానం ఢిల్లీలో సురక్షితంగా దిగింది. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించారు.

## మహిళలను తిట్టకుండా.. రాజకీయాల్లో నిలబడి చూపించండి: ఖుష్బూ



నటి త్రిషపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తమిళనాట తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై నటి, భాజపా నాయకురాలు ఖుష్బూ మరోసారి మండిపడ్డారు. ధైర్యముంటే మహిళలను తిట్టకుండా రాజకీయం చేయాలంటూ సవాల్ విసిరారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ అంశంతో పాటు త్రిషతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఉదయనిధి వ్యాఖ్యలు మహిళలపై ఆయనకు ఉన్న ద్వేషాన్ని తెలియచేస్తున్నాయన్న ఖుష్బూ దుయ్యబట్టారు. ఒక నాయకుడిగా ఆయన దీనికి సిగ్గుపడాలని విమర్శించారు. ''ఒక బహిరంగ వేదికపై మహిళను దూషించే జన్మహక్కు మీకు ఎవరు ఇచ్చారు? ఇది కేవలం ఉదయనిధి స్టాలిన్ విషయంలోనే కాదు.. ఇతర రాజకీయ పార్టీలలోనూ జరుగుతోంది. మీ రాజకీయ ప్రయోజనాల కోసం ఇంకెన్నాళ్లు మహిళలను నిందిస్తారు? మీ స్వార్థ ప్రయోజనాల కోసం మహిళను అడ్డుపెట్టుకుని ప్రగల్భాలు పలుకుతూ ఆమెను అవమానిస్తున్నారంటే.. మీరు ఎంత బలహీనంగా ఉన్నారో అర్థమవుతోంది. మిమ్మల్ని మీరు బలమైన నాయకుడని చెప్పే అర్హత కోల్పోయారు. మీకు ధైర్యముంటే, నిజమైన నాయకుడిగా కొనసాగాలంటే.. ఏ మహిళనూ దూషించకుండా రాజకీయాల్లో నిలబడి చూపించండి. అది చేయగలరో లేదో చూద్దాం'' అని ఖుష్బూ సవాలు విసిరారు. మహిళలను నిందించే సంస్కృతి డీఎంకే పార్టీ వారసత్వంలోనే ఉందని విమర్శించిన ఖుష్బూ.. మహిళలు రాజకీయాల్లో పావులు కారని స్పష్టం చేశారు. ''నేను ఇలాంటి మాటలు, లింగవివక్ష వ్యాఖ్యలను గతంలోనూ చూశాను. డీఎంకేలో మహిళలపై వేధింపులు జరగడం కూడా చూశాను. కానీ, ఉదయనిధి స్టాలిన్ నుంచి ఇలాంటి మాటలు ఊహించలేదు. ఆయన యువ నాయకుడు, హుందాగా ప్రతిపక్షంలో ఉంటారని భావించాను. కానీ ఆయన కూడా ఇలాంటి అసభ్యకరమైన, నీచమైన వ్యాఖ్యలు చేయడం దిగ్భ్రాంతి కలిగించింది. ఆయనలో ఇప్పటికీ పశ్చాత్తాపం లేకపోవడం మరింత విచారకరం'' అని ఖుష్బూ అన్నారు.

**త్రిష నా కుటుంబసభ్యురాలితో సమానం..**

త్రిషతో తనకున్న అనుబంధాన్ని ఖుష్బూ ఈ సందర్భంగా పంచుకున్నారు. ''త్రిష చాలా మంచి వ్యక్తి. సినీ పరిశ్రమలోకి రాకముందు నుంచి ఆమె నాకు తెలుసు. నా కుటుంబంలో ఆమె కూడా ఒక సభ్యురాలే. మా పిల్లలకూ ఆమె ఎంతో దగ్గరైంది. మా కుమార్తె పెళ్లికి నాలుగు రోజులు మా ఇంట్లోనే ఉండి అన్ని పనులు దగ్గరుండి చూసుకుంది'' అని ఖుష్బూ వివరించారు.



## ఆందోళనల మాటున అరాచకమా?

ఎప్పుడు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నా దేశ రాజధాని ఢిల్లీ వేడెక్కడం రివాజుగా మారింది. భారత్‌ను నియంత్రించడమే లక్ష్యంగా ఉన్న అమెరికా, బ్రిటన్ వంటి దేశాల పత్రికలలో వచ్చిన వార్తల ఆధారంగానో, ఇక్కడ జరిగిన ఒక ఘటననో చూపించి చట్టసభలను అదేపనిగా అడ్డుకోవడం కొన్ని రాజకీయ పక్షాలకు దశాబ్దకాలంగా అలవాటుగా మారింది. ఇందులో ప్రధానపాత్ర దేశాన్ని నాలుగు దశాబ్దాలు పాలించి, ఇప్పుడు అధికారం లేక తల్లడిల్లిపోతున్న కాంగ్రెస్ పార్టీదే. అవినీతికి, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా 2013లో అన్నా హజారే నిరశన వ్రతం చేపడితే, రాహుల్‌గాంధీ దృష్టిలో నాడు అది దేశానికి అరిష్టం. కానీ, ఆయన ఇప్పుడు సోనమ్ వాంగ్‌చుంగ్ నిరశనకు పరోక్షంగా మద్దతు ఇచ్చారు, పార్లమెంట్ ముట్టడికి వచ్చిన కాక్రోచ్ పార్టీ కార్యకర్తలకు వత్తాసు పలికారు. అంతేకాదు, ఏకంగా ప్రధానమంత్రి నివాసం ఎదుట, ఎలాంటి సమాచారం లేకుండా తానే స్వయంగా ధర్నాకు దిగారు. చైనాతో జరిగిన యుద్ధంలో భారత్ ఓడినా ప్రధాని పదవికి రాజీనామా చేయని వ్యక్తి కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ, ఆ చెట్టు పేరుతోనే మనుగడ సాగిస్తున్న ఈ నేత, ఇప్పుడు నీట్ నిర్వహణలో జరిగిన ఒక తప్పిదాన్ని చూపి, ప్రధాని రాజీనామా చేయాలని ధర్నాకు దిగడం ఎంత అసంబద్ధమో కదా!

నీట్ ప్రశ్నపత్రం బహిర్గతమయినందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని 'విద్యార్థులు' పేరుతో ఈ ఉద్యమం ప్రారంభమయింది. ఏదైనా ప్రశ్నపత్రం బహిర్గతం కావడం ఒక తరం మీద దుష్ప్రభావాన్ని చూపేదే. అది అవ్యవస్థకు నిదర్శనం కూడా. కానీ కేవలం నీట్ ప్రశ్నపత్రం బహిర్గతమయినందుకు ప్రారంభమైన ఈ నిరసనలో, అది కూడా జెన్–జీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అలజడిలో నిజాయితీ ఎంత? అహింసాయుతంగా పోరాటం చేస్తామని అది చెబుతోంది కానీ, జూలై 20న 'వేలాదిమంది' జరిపిన పార్లమెంట్ ముట్టడి ప్రయత్నంలో కనిపించినది అహింసా పంథాయేనా? సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష శిబిరంలో కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370 పునరుద్ధరణ ప్రస్తావన ఎందుకు? దీనికీ నీట్ ప్రశ్నపత్రం లీక్‌కీ సంబంధం ఏమిటి? ప్రశ్నపత్రం బహిర్గతం కావడానికి, సీతారాములకు ముడిపెట్టి ఒక స్టాండప్ కమేడియన్ తన పైత్యాన్ని ప్రదర్శించడం ఎందుకు? ఇస్లాంను కీర్తించే గజల్స్ మారుమోగడం ఎందుకు? భరతమాత భావనను కించపరచడం ఎందుకు?

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జెన్–జీ ఉద్యమం వలెనే భారత్‌లోనూ యువతరం తిరగబడుతోంది అంటూ పార్లమెంట్ వేదికగా కూడా బీజేపీ ప్రభుత్వానికి బెదిరింపులు వినిపించాయి. జూలై 20 నాటి పార్లమెంట్ ముట్టడి వేళ కూడా కొందరు వీరావేశంగా టీవీ చానెళ్ల ముందు అలాగే గర్జించారు. ఇంతకీ ఆ మూడు దేశాలలో జెన్–జీ ఉద్యమం తరువాత పరిస్థితి ఏమిటి? వాంగ్‌చుక్ జంతర్ మంతర్ దగ్గర ఆమరణ దీక్షకు కూర్చున్నప్పుడే నేపాల్‌లో సమాంతరంగా జరిగిన పరిణామాలు అభిజిత్ దీప్కే, అనుచర జెన్–జీలకు తెలియనట్టుంది. జెన్–జీ హింసాయుత అలజడితో ఇటీవలే నేపాల్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన బాలెన్‌షాను ఇప్పుడు అదే జెన్–జీ రాజీనామా చేయాలంటూ రోడ్డెక్కింది. ఇక్కడ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ పేరుతో దేశాన్ని అస్థిరం చేయాలన్న అసంబద్ధ వైఖరిని మరిపిస్తూనే, రాంగ్ పార్కింగ్‌లో మోటార్ బైక్‌ను ఉంచిన గణేశ్ అనే నేపాలీ యువకుడు, ట్రాఫిక్ పోలీసులతో గొడవపడి పెట్రోలు పోసుకుని ఆత్మాహుతికి పాల్పడటంతో దీనికి బాధ్యత వహిస్తూ బాలెన్ రాజీనామా చేయాలని జెన్–జీ రోడ్డెక్కింది. అంతేనా! ప్రభుత్వ స్థలాలలోని అక్రమ కట్టడాలను కూల్చినందుకు కూడా బాలెన్‌మీద జెన్–జీ కన్నెర్ర జేసింది. బంగ్లాదేశ్‌లో హసీనాను తరిమేసి, యూసుఫ్‌ను దేశాధినేతను చేసింది జెన్–జీ. కానీ, ఆయన మీద కూడా అనతికాలంలోనే అసంతృప్తి రేగింది.

కాంగ్రెస్, దాని వెంట ఉన్న విపక్షాలు పూర్తిగా అరాచకాన్నే కోరుకుంటున్నాయి. జూలై 21న ప్రధాని అధికార నివాసాన్ని ముట్టడించడం ముమ్మాటికీ అరాచక సృష్టికే. 2022లో శ్రీలంకలో రాజపక్స అధికార భవనాన్ని ఆక్రమించడం, 2025లో నేపాల్‌లో ప్రధాని కేపీ శర్మ ఓలి నివాసాన్ని ముట్టడించడం గుర్తుకు రావడం లేదా? 'నేపాల్ పరిస్థితులు వస్తాయనీ, తెస్తామనీ' గొంతు చించుకునే నాయకుల, పార్టీల ఉద్దేశం అక్కడిలాగే మన పార్లమెంట్ భవంతికి నిప్పు పెట్టడమేనా? అంతేకాదు, ఢిల్లీ తాజా పరిణామాలు కొందరు రైతులకు తమ డిమాండ్లను గుర్తుకు తెచ్చాయి కూడా.

దేశంలో రాజకీయ నిరుద్యోగులకూ, కొన్ని చట్టాలు రావడం ఇష్టంలేని వారికీ విద్యార్థుల జీవితాలే గుర్తుకు వస్తాయి. కాబట్టి జెన్–జీలో కనిపించే అవలక్షణాలను ఇకనైనా బేరీజు వేసుకోవాలి. ఇది అరాచకాన్ని నమ్ముకుంది. అలజడి చేయడానికి తీసుకున్న విషయం ఒకటైతే, అంతర్గతంగా ఉండే ఆలోచన వేరొకటి. ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్నే తుదముట్టించే గొడ్డలి పిడి తరహా లక్షణం వీరి సొంతం. త్రివర్ణ పతాకం పట్టుకుని మరీ దేశ సార్వభౌమాధికారం పట్ల అవిధేయతను ప్రదర్శిస్తున్నారు. రాజ్యాంగ ప్రతులను, డాక్టర్ అంబేడ్కర్ చిత్రాలను పట్టుకుని విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఈ అంశాలను యువత గుర్తించాలి. ప్రజాస్వామ్య పద్ధతులలో వ్యవస్థను మెరుగుపరచడానికి ఆలోచించాలి. అరాచకాన్ని తెచ్చుకుంటే అభివృద్ధిని అర్ధ శతాబ్దం వెనక్కి నెట్టడమే.



# "కూటమి ప్రభుత్వం"... కానీ ప్రచారంలో కూటమి ఎక్కడ?

**"రెండు రెళ్లు ఆరు" అనేది గణిత సూత్రం కాదు, రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా మారే రాజకీయ వ్యూహాన్ని సూచించే సామెత. అంటే, ఇద్దరు కలిసి పనిచేస్తే వారి ప్రభావం కేవలం "2+2=4" కాకుండా, "2+2=6" అయ్యేంతగా పెరగవచ్చని దాని భావం.. దీనిని నిజం చేసి చూపెట్టింది గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం. ఒక నాయకుడికి పరిపాలనా అనుభవం, మరొక నాయకుడికి ప్రజాదరణ ఉంటే కలిపి ప్రభావం మరింత పెరుగుతుందని 2024 ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి విజయం నిరూపించింది. అయితే అన్నిసమయాల్లోను ఇదే సూత్రం వర్తించకపోవచ్చు. పార్టీల కలయిక, వారి ఉమ్మడి మ్యానిఫెస్టో రూపకల్పన, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం, ప్రచారం, ఎన్నికల నిర్వహణ వంటి అనేక అంశాలు కూడా ప్రభావం చూపుతాయి.**




ఆంధ్రప్రదేశ్‌లో అధికారం మారి రెండేళ్లు పూర్తి అయ్యింది. రాజకీయ సమీకరణాలు మారాయి. కానీ ప్రభుత్వ ప్రచారంలో అధికార పార్టీ ఆధిపత్యం మాత్రం మారలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన "కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు" ప్రకటనలు ఇదే ప్రశ్నను మళ్లీ తెరపైకి తీసుకొచ్చాయి.రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ ప్రకటనల్లో కనిపిస్తున్నది మాత్రం ప్రధానంగా టీడీపీ నాయకత్వమే. దీంతో ఎన్నికల ముందు ఉన్న కూటమి ప్రచారం, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ప్రచారం మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది.

ఎన్నికల ముందు... టీడీపీ + జనసేన కూటమి :

2024 ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన కలిసి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాయి. ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల సందర్భంలోను బీజేపీ మాత్రం కాస్త వెనకడుగా ఉంది. టీడీపీ, జనసేన మాత్రమే సూపర్ సిక్స్, మహాశక్తి వంటి హామీలతో పాటు ఇంటింటికీ వెళ్లి గ్యారంటీ పత్రాలు పంపిణీ చేశాయి. అనేక ప్రాంతాల్లో లబ్ధిదారుల పేర్లతో నమోదు (రిజిస్ట్రేషన్) కార్యక్రమాలు కూడా నిర్వహించాయి. ఆ ప్రచారంలో ప్రధానంగా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సెంట్రిక్ గా మాత్రమే ప్రచారం జరిగింది. అయితే, బీజేపీ తర్వాత కూటమిలో చేరి ఎన్నికలను కలిసి ఎదుర్కొన్నప్పటికీ, గ్యారంటీ పత్రాల ప్రచారం లేదా రిజిస్ట్రేషన్ కార్యక్రమాల్లో బీజేపీ ప్రత్యేక పాత్ర అంతగా కనిపించలేదనేది సుస్పష్టం.

అధికారంలోకి వచ్చాక... "కూటమి ప్రభుత్వం"

ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రభుత్వంలో మూడు పార్టీలకు వారి వారి నిష్పత్తుల ప్రకారం పదవులు తీసుకొని పొత్తు ధర్మం ప్రకారం ముందుకు వెళ్తుంది. అయితే ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లు దాటిన తర్వాత "కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు" పేరుతో ప్రకటనలు విడుదల చేసింది. ఈ ప్రకటనల్లో ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఫోటోలు, టీడీపీ ఎన్నికల గుర్తు (సైకిల్) కనిపించాయి కానీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ గుర్తు, ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ కమలం గుర్తు ఇవేమీ కనిపంచలేదు. ప్రచార పత్రంలో "కూటమి ప్రభుత్వం" అనే పదం ఉన్నప్పటికీ, విజువల్ రూపకల్పనలో కూటమి భాగస్వాముల ప్రాతినిధ్యం కనిపించకపోవడం రాజకీయ చర్చకు దారితీసింది. ఎన్నికల ముందు కలిసి గ్యారంటీ పత్రాలు ఇచ్చిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ప్రభుత్వ ప్రకటనల్లో ఎందుకు లేరు? ఉప ముఖ్యమంత్రి హోదాకు తగిన ప్రాధాన్యం ఎందుకు ఇవ్వలేదని జనసేన శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి భాగస్వామి అయినప్పటికీ ప్రధాని మోదీ లేదా పార్టీ గుర్తుకు ఎందుకు చోటు దక్కలేదని బీజేపీ శ్రేణులు అంతర్మథనం చెందుతున్నారు. గత ప్రభుత్వం "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించినప్పుడు... ఆ ప్రచారంలో వై.యస్. జగన్ ఫోటోలు, వైసీపీ రంగులు, పార్టీ బ్రాండింగ్ ప్రధానంగా కనిపించేవి. అప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే స్వరంతో విమర్శించాయి. ప్రజల డబ్బుతో పార్టీ ప్రచారం చేస్తున్నారని ఆరోపించాయి. ఇప్పుడు అదే విమర్శ... కూటమి ప్రభుత్వంపైన ప్రతిపక్ష వైసీపీతో పాటు కొన్ని చోట్ల అధికార పక్ష భాగస్వాములైన జనసేన, బీజేపీ శ్రేణులు కూడా విమర్శించడం గమనార్హం. ప్రభుత్వ ప్రకటనల్లో ప్రభుత్వం కనిపించాలా? లేక అధికార పార్టీ కనిపించాలా? అనే ప్రశ్న ముందుకొస్తోంది. ఇటీవల జరిగిన భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతికి అంకితం చేశారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత బ్యానర్లు, ఫ్లెక్సీల ఏర్పాటులోను కూటమిలో జనసేనకు ప్రాధాన్యత ఇవ్వలేదని కొంతమంతి జనసేన శ్రేణులు ఆందోళన చేశారు. కొన్ని సందర్భాల్లో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలు ఏర్పాటు చేసినప్పుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటో వేసి తర్వాత దానిని తొలగించడం పై పవన్ కళ్యాణ్ స్వయంగా మాట్లాడిన సందర్భాలున్నాయని గుర్తుంచుకోవాలి. అయితే కూటమిలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం బలహీనపడినప్పుడు, కార్యకర్తల్లో పొత్తులపై విశ్వాసం తగ్గినప్పుడు, ఉమ్మడి లక్ష్యం స్పష్టంగా లేనప్పుడు. పార్టీల మధ్య అంతర్గత విభేదాలు బయటపడినప్పుడు, ఓటు బదిలీ పూర్తిగా బదిలీకానప్పుడు. నాయకత్వంలో సమన్వయలోపాలు తలెత్తినప్పుడు.స్థానిక రాజకీయ సమీకరణలు కూటమికి అనుకూలంగా లేకపోతే "రెండు రెళ్లు ఆరు కాదు రెండు రెళ్లు రెండు లేదా సున్నాగా మిగిలిపోతుం దని గ్రహించాలి.

– కర్రే సుబ్బారావు, జర్నలిస్టు

# నిరసన స్వరాలు వింటారా?

**పార్లమెంటు వర్షా కాల సమావేశాల తొలిరోజైన సోమవారం ఢిల్లీ ఆకాశంలో నిరసన మబ్బులు దట్టంగా అలుముకున్నాయి. రాజవీధులన్నీ వేలాది యువగళాలతో హోరెత్తాయి. పన్నెండేళ్ల బాలిక మొదలుకొని అనేకమంది యువతీయువకులు పోలీసుల లాఠీచార్జిలో గాయపడి నెత్తురోడుతున్న, విలపిస్తూ నిలదీస్తున్న దృశ్యాలు చానెళ్లలో వీక్షించటం చాలామందికి కష్టంగా తోచింది. ఈ దశాబ్ద కాలంలో దేశ రాజధాని ఎన్నడూ చూడని దృశ్యాలివి. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై గత నెల జూన్ 6 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) చేస్తున్న ఆందోళననూ, మూడు వారాలుగా కొనసాగుతున్న నిరశనలనూ మౌనంగా వీక్షిస్తూ ఉండిపోయిన ప్రభుత్వానికి సోమవారం నాటి 'చలో సంసద్' కళ్లు తెరిపించి ఉండాలి. అందుకే కావొచ్చు... కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా ఉద్యమ కార్యకర్తలను చర్చలకు పిలిచారు. అక్కడేమైంది, చివరకు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందన్న సంగతలా ఉంచితే ముందు వినడం పాలకులు చేయాల్సిన పని.**



పదిహేనేళ్ల క్రితం అన్నా హజారే నిరశన మొదలెట్టినప్పుడు ఆనాటి యూపీఏ ప్రభుత్వం మొదట్లో పట్టించుకోకున్నా, ఆ తర్వాత కేంద్ర మంత్రులతో ప్రతినిధి బృందాన్ని పంపింది. దాన్ని సంపూర్ణంగా సమర్థించి, క్రియాశీలంగా పాల్గొని దేశవ్యాప్తంగా ఆ ఉద్యమానికి ఊపూ ఉత్సాహాన్నీ తీసుకొచ్చింది బీజేపీయే. అందు మూలంగా ఇతోధికంగా లాభపడింది కూడా. కానీ అదే పార్టీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు నిర్లిప్తంగా ఉండి పోవటం, సమస్యను ఇంత సంక్లిష్టం చేసుకోవటం దిగ్భ్రాంతికరం. ఈ ఆందోళనలో గాయపడిన వారిలో వందమంది వరకూ రాంమనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్సకు చేరగా వారిలో తలలు పగిలినవారూ, కాళ్లూ చేతులూ విరిగినవారూ అనేకులున్నారని జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. అటు 118 మంది పోలీసులు గాయాలతో ఆస్పత్రుల్లో చేరారని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.

పాలకులుగా ఎవరుండాలో ఎన్నికలు చెబితే... వారి పాలన ఎలావుందో నిరసనలు చెబుతాయి. అసమ్మతి అనేది దేశభక్తికి అత్యున్నత రూపం అంటాడు అమెరికా రాజనీతి శాస్త్ర ఆచార్యుడు హోవార్డ్ జిన్. ప్రజాస్వామ్యంలో విభేదించేందుకూ, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకూ చోటివ్వడం ప్రభుత్వాల బాధ్యత. ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటం విపక్షాల బాధ్యత కూడా. కానీ విషాదమేమంటే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఈ కర్తవ్య నిర్వహణలో విఫలమైంది. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒకరోజు ధర్నా చేయటం మినహా చేసిందేమీ లేదు. అన్నా హజారే ఉద్యమ సమయంలో జరిగిందేమిటో గుర్తున్నా తాను చేయాల్సిందేమిటో ఆ పార్టీకి తెలిసేది. ఆ సంగతి ఆలస్యంగా గ్రహించి మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం సమీపంలో రాహుల్, ప్రియాంక, ఇతర కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేశారు.

ఈ ఉద్యమానికి చెప్పుకోదగ్గ నాయకులంటూ ఎవరూ లేకపోవడం గమనించదగ్గది. నిరశనలో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టుచేసి ఆస్పత్రిలో చేర్చారు. సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కేను ప్రదర్శన ప్రారంభంలోనే పోలీసులు అరెస్టు చేశారని వార్తలొచ్చాయి. కానీ దాదాపు 50,000 మంది వరకూ ఉన్న ఆందోళనకారులు గుంపులుగా విడిపోయి పార్లమెంటువైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయటం, చాలావరకూ సఫలీకృతం కావటం చిన్న విషయం కాదు. పటేల్ చౌక్, జన్‌పథ్ గేటు మెట్రో స్టేషన్‌ల వద్ద, అశోకా రోడ్, కన్నాట్‌ప్లేస్ సర్కిల్ వద్ద బైఠాయింపులు, మరో అయిదుచోట్ల వారిపై బాష్ప వాయు గోళాలు ప్రయోగించటం సమస్య తీవ్రతను వెల్లడిస్తుంది.

హింసకూ, దౌర్జన్యానికీ దిగినవారిని నియంత్రించటాన్ని ఎవరూ ప్రశ్నించరు. కానీ ఒక్కరిని చేసి ఏడెనమండుగురు పోలీసులు లాఠీలతో మోదటం, ఆడపిల్లలని కూడా చూడకుండా హింసించటం సబబేనా? 'మీ ఇంట్లో పిల్లలు లేరా? ఇంత దారుణంగా కొడతారా?' అని ఒక బాలిక ప్రశ్నించటం, తన దుస్తులు చించారని మరొకామె ఆరోపించటం ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచదు. పరీక్షపత్రాలు లీకవటం, కష్టపడి చదివేవారు దగాపడటం తొలిసారి కాదు. ఏళ్లతరబడి ఇలా జరగటంవల్లే పరిస్థితి ఇంతవరకూ వచ్చింది. ఇకనైనా విద్యార్థుల అభీష్టాన్ని వినటం, సానుకూలంగా స్పందించటం ప్రభుత్వ బాధ్యత. లేకుంటే సమస్య మరింత జటిలమవుతుంది.

# పేద పిల్లల భవిష్యత్తుకు పునాది

**నవ్యాంధ్ర అక్షర యజ్ఞంలో ఒక విప్లవాత్మక ముందడుగు 'తల్లికి వందనం'. పిల్లల చదువులకు పేదరికం ఎన్నటికీ అడ్డుగోడ కాకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి పేద విద్యార్థి ఇంటా చదువుల పండుగ తీసుకురావాలని, పిల్లల భవిష్యత్తును చూసి ప్రతి తల్లీ గర్వపడాలనే మహోన్నత ఆశయంతో ఈ అడుగు పడింది.చదువు కేవలం కొందరికే పరిమితం కాకుండా, ప్రతి పేద బిడ్డకూ అందాలన్నదే ప్రభుత్వ తాపత్రయం. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో కూడా పిల్లల చదువుల కోసం అహర్నిశలూ శ్రమించే లక్షలాది మంది తల్లులకు కొండంత అండగా నిలవడమే ఈ పథకం ఉద్దేశం. ఇది కేవలం ఓట్ల కోసం తెచ్చిన పథకం కాదు, పిల్లలు పెద్దయ్యాక మంచి ఉద్యోగాల్లో స్థిరపడి, సొంత కాళ్ల మీద నిలబడడానికి వేసిన ఒక బలమైన పునాది.**

గత ప్రభుత్వం 'అమ్మ ఒడి' పేరుతో.. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా కేవలం ఒక్కరికే పథకాన్ని వర్తింపజేసి చేతులు దులుపుకుంది. ఏ తల్లి అయినా తన పిల్లల్లో ఒకరిని ఎక్కువ, ఒకరిని తక్కువ అని చూసుకోదు. ఆనాటి సంకుచిత విధానాలు తల్లుల మనసులను గాయపరిచాయి. ఆ వివక్షకు చరమగీతం పాడుతూ కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అత్యంత మానవీయ కోణంలో సంస్కరించింది. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే, అంతమందికీ రూ.15,000 చొప్పున అందిస్తూ ప్రతి తల్లి కలను సాకారం చేస్తోంది.

ఈ బృహత్ కార్యాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా అత్యంత పకడ్బందీగా, భారీ బడ్జెట్‌తో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం రూ.6,450 కోట్లతో 43 లక్షల మంది విద్యార్థులకు అరకొరగా లబ్ధి చేకూరితే, నేడు కూటమి ప్రభుత్వం రూ.10,120.78 కోట్ల భారీ బడ్జెట్‌తో ఏకంగా 67.47 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం సహాయాన్ని అందిస్తున్నది. చదువుకు ప్రభుత్వం ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యానికి ఈ అంకెలే నిదర్శనం. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు బడ్జెట్‌లో చేసిన అధిక కేటాయింపుల ద్వారా ఊళ్లలో స్కూళ్ల రూపురేఖలు మార్చడానికి, టీచర్ల కొరతను తీర్చడానికి, పిల్లలకు నాణ్యమైన చదువుతో పాటు మంచి సౌకర్యాలు కల్పించడానికి తీసుకుంటున్న చర్యలు మరింత బలోపేతం అవుతాయి.

గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ పిల్లలకు సాయం అందడం లేదని కంటతడి పెట్టారు. వారి నిస్వార్థ శ్రమను గుర్తిస్తూ, వారి సంపాదనతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరి పిల్లలకూ ఈ సాయాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రాష్ట్రంలో అదనంగా 17 వేల మంది అంగన్‌వాడీల పిల్లలకు ఈ లబ్ధి చేకూరుతోంది.

నిధుల పంపిణీ ప్రక్రియను కూడా కేవలం ఒక ప్రభుత్వ తంతుగా కాకుండా, అత్యంత పారదర్శకమైన రీతిలో సమయపాలనతో ముందుకు తీసుకెళ్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న నిరుపేద విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఈ జూలై 22న మొదటి విడత నిధులను జమ చేశారు. ఇందులో తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.13,000, పాఠశాల నిర్వహణకు రూ.2,000 కేటాయిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శిస్తూ, ఎవరికైనా సాంకేతిక సమస్యల వల్ల సహాయం అందకపోతే జూలై 22 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు సచివాలయాల ద్వారా అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించారు. ఫిర్యాదులను పరిశీలించి, అదనపు అర్హుల జాబితాల తయారీని ఆగస్టు 4 నుంచి ఆగస్టు 10 లోగా పూర్తి చేస్తారు. కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను సైతం ఆగస్టు 25 నాటికి నమోదు చేసుకొని, ఆగస్టు 30 కల్లా నూరు శాతం నిధులను తల్లుల ఖాతాలలో చేర్చేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈ అక్షర యజ్ఞం కేవలం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం కాలేదు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్లు పొందిన 1.04 లక్షల మంది నిరుపేద విద్యార్థుల తల్లులను కూడా ఈ పథకం కిందికి చేర్చారు. వారి స్కూల్ ఫీజును సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నేరుగా పాఠశాలలకు చెల్లిస్తూ, మిగిలిన మొత్తాన్ని తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ఏ ఒక్క పేద కుటుంబానికి కూడా వారి కులం వల్లనో, మతం వల్లనో వివక్ష జరగకూడదన్నదే కూటమి సిద్ధాంతం. సమాజంలో అర్హుడైన లబ్ధిదారుడు సాంకేతిక కారణాల వల్ల నష్టపోకూడదన్న తపనతో ప్రభుత్వం 'మనమిత్ర' వాట్సప్ చాట్ బాట్, 'లీప్' యాప్‌లను పరిచయం చేసింది. వీటి ద్వారా ప్రతి ఒక్కరూ తమ అర్హతలను తనిఖీ చేసుకుని, తమ హక్కును సులభంగా పొందే వీలు కల్పించింది. కూటమి ప్రభుత్వంలో లంచాలకు, సిఫార్సులకు తావు లేకుండా కేవలం అర్హతలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటోందని, రేపటి అంతర్జాతీయ వేదికలపై మన పిల్లలు విజేతలుగా నిలబడాలన్నదే ప్రభుత్వ కల అని చాటిచెబుతున్నారు. అమ్మ ప్రేమను, ఆమె పడుతున్న కష్టాన్ని గౌరవిస్తూ ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం రాబోయే తరాలకు ఒక బలమైన ఆయుధంగా నిలుస్తున్నది. రాష్ట్రాన్ని అక్షరాస్యతలో, నాలెడ్జ్ ఎకానమీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపడానికి మనమంతా కలిసికట్టుగా సాగాలనే ఆకాంక్షతో, పిల్లల తలరాతను మార్చే చదువుకు శ్రీకారం చుట్టే బాధ్యతను ప్రభుత్వం సంపూర్ణంగా తీసుకుంది.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# లింగ నిర్ధారణ లింగ ఎంపిక నిర్వహిస్తే కఠిన చర్యలు

**- చట్టాన్ని కట్టు దిట్టంగా అమలు చేయాలి...**

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 05 అనంత జన శక్తి న్యూస్.**




లింగ నిర్ధారణ లింగ ఎంపిక నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఫైరోజా బేగం పేర్కొన్నారు. బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా ఎం టీ పీ కమిటీ సమావేశం జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం . నిర్వహించారు.
మెడికల్ పర్మినేషన్ ఆఫ్ ప్రోగ్రెసి యాక్ట్, జిల్లాలోని 17 ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ సేవలు అందించేందుకు సమర్పించిన దరఖాస్తులను జిల్లా కమిటీ పరిశీలించింది. కమిటీ సభ్యులైన గైనకాలజిస్ట్, పీడియాట్రిషన్, ఫిజీషియన్, ఏరియా ఆసుపత్రి కదిరి మెడికల్ సూపరింటెండెంట్ డా. హుస్సేన్ తదితరులు ఆసుపత్రుల్లో ఉన్న సౌకర్యాలు, అర్హతలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న 17 ప్రైవేట్ ఆసుపత్రులకు ఎం టి పి సేవలు నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు.అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో పి సి పి ఎన్ డి టి యాక్ట్ 1994 నిబంధనలను జిల్లాలో అత్యంత కట్టుదిట్టంగా అమలు చేయాలని డిఎంహెచ్వో డాక్టర్ ఫైరోజా బేగం ఆదేశించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి చట్టవిరుద్ధ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.సంబంధిత అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి, ప్రజల్లో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ ఓ కళాధర్, డిప్యూటీ డి ఈ ఎం ఓ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ హెచ్ ఈ ఓ రామలక్ష్మి, డిపిహెచ్ఎన్ఓ . వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కోట లో ఘనంగా ఎమ్మెల్యే అమిలినేని జన్మదిన వేడుకలు



**- మహిళలకు చీరలు పంపిణీ**
**- ఎమ్మెల్యే అమిలినేని కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కోట కార్యకర్తలు ప్రజలు**
**- ఎస్. రామన్న ఆధ్వర్యంలో అన్నదానం**

**కళ్యాణదుర్గం ఆగస్ట్ 05 జనశక్తి న్యూస్**

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలు పట్టణంలోని కోటవీధి కాలనీ నందు వార్డ్ ఇంచార్జ్ టిడిపి సీనియర్ నాయకులు ఎస్ రామన్న ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పట్టణ కన్వీనర్ మాదినేని మురళి గుబానపల్లి మల్లికార్జున ఆకుల రెహమాన్ బిజెపి ముప్పూరి దేవరాజ్ లకు సన్మాన కార్యక్రమం నిర్వహించి. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కు జన్మదిన శుభాకాంక్షలు పెద్ద ఎత్తున కాలనీ ప్రజలు నాయకులు కార్యకర్తలు తెలిపారు. అనంతరం నాయకులు మహిళలకు చీరలు పంపిణీ చేసి మరల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18 వార్డ్ ఇంచార్జ్ ఎస్ రామన్న బి .ఎల్ .ఏ రామాంజినేయులు పార్లమెంట్ సెక్రటరీ ప్రకాష్ డీలర్ నాగప్ప ట్రాక్టర్ గోపాలప్ప బోయ మారుతి కొడిగి రాము సంజీవరెడ్డి రమణ నవీన్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం

**- మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్**
**- జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు**

**అనంతపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**




మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయంగా శ్రమిస్తామని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కోర్టు రోడ్డులో గల శివకృప కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గంలోకి పలువురికి అవకాశం కల్పించినట్లు జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి నారాయణమ□ర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు. రాయితీలు, సంక్షేమ పథకాలు అర్హులైన మత్స్యకారులకు అందేలా చూస్తామన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, న్యాయవిభాగం జిల్లా అధ్యక్షులుగా బెస్త ఓబులరాజు, జిల్లా సలహాదారునిగా తుపాకుల శంకర్, జిల్లా ప్రచార కార్యదర్శిగా బెస్త రాములను ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటా రాజేశ్వరి, రాష్ట్ర మహిళా సభ్యురాలు వనజ వాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొడుగు నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పిల్లి మద్దిలేటి, జిల్లా గౌరవ సలహాదారులు వరదాయపల్లి మాజీ సర్పంచ్ బెస్త రమణ, బెస్త గంగప్ప, జిల్లా ఇన్‌ఛార్జ్ శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త విజయ సత్యం, బెస్త వెంకటేష్, జిల్లాల కోశాధికారి బెస్త రామాంజనేయులు, నగర అధ్యక్షులు బెస్త అశోక్, సభ్యులు బెస్త శంకర్ ప్రసాద్, బెస్త నారాయణస్వామి, బెస్త మల్లికార్జున, బెస్త శ్రీరాం, బెస్త అంజి, బెస్త ఓబులేసు, బెస్త ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షా లకు నెలకొన్న సమస్యలపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్ .. కదలిన యంత్రాంగం



**- భక్తుల దర్శనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు**
**- వర్షా ల నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచన**

**నిడదవోలు ఆగస్టు 05 ,అనంత జనశక్తి న్యూస్**

భారీ వర్షాల ధాటికి నిడదవోలు రూరల్ మండలం తిమ్మరాజుపాలెంలోని ప్రసిద్ధ శ్రీ కోటసత్తెమ్మ తల్లి ఆలయంలోకి, అలాగే నిడదవోలు ఎర్నగూడెం, నిడదవోలు కంసాలిపాలెం రహదారి పైకి పంట కాలువ నీరు వచ్చి చేరిందన్న సమాచారం అందగానే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తక్షణమే స్పందించారు. సమస్య తీవ్రతను గు గుర్తించి, సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.మంత్రి దుర్గేష్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయికి చేరుకున్న అధికారులు, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలించి నీటి ముంపు సమస్యను త్వరితగతిన పరిష్కరించారు. పంట కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్కను జేసీబీల సాయంతో వెంటనే తొలగించారు. ఆలయ ప్రాంగణంలోకి చేరిన వరద నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపింగ్ చేయించారు. ఆలయ ప్రాంగణంలో త్వరితగతిన పారిశుధ్య పనులు పూర్తి చేసి, బ్లీచింగ్ తదితర క్రిమిసంహారకాలతో శుభ్రపరచాలని మంత్రి ఆదేశించడంతో అధికారులు చర్యలు చేపట్టారు. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అంతరాలయ దర్శనం కల్పించాలని సూచించారు. వర్షాల వల్ల ఎర్నగూడెంకంసాలిపాలెం రహదారిపై రాకపోకలకు ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.వర్షాకాలం పూర్తయ్యే వరకు ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. విజయవాడలో ఉన్నప్పటికీ మంత్రి కందుల దుర్గేష్ సమయానుకూల స్పందన, అధికారుల త్వరితగతిన చర్యలతో ఆలయంలోకి చేరిన నీరు పూర్తిగా తొలిగిపోవడంతో భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# బొర్రా పంచాయతీలో ఉద్యానవన మొక్కల పంపిణీ.



**- విబిజి-రాం-జి ద్వారా 55 మంది రైతులకు నాణ్యమైన మొక్కలు అందజేత.**

**అనంతగిరి, ఆగస్టు 05 అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బొర్రా గ్రామపంచాయతీలో బుధవారం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ అరుణ నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ దిసరి గంగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అర్హులైన 55 మంది రైతులకు వివిధ రకాల నాణ్యమైన ఉద్యానవన పంటల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం రైతులకు మొక్కల సంరక్షణ, నిర్వహణ, సాగు పద్ధతులపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ దిసారి గంగరాజు మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మొక్కలను శ్రద్ధగా పెంచితే భవిష్యత్తులో అధిక దిగుబడులు సాధించి మంచి ఆర్థిక లాభాలు పొందవచ్చని సూచించారు.కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నరేంద్ర, పెసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అవసరమైతే రాంచీకి వెళ్తాం

**- జార్ఖండ్ విద్యార్థి ఉద్యమానికి సీజేపీ మద్దతు**
**- అభిజీత్ దిప్కే ప్రకటన**
**- రాజకీయ పార్టీ కాదు.. ప్రెషర్ గ్రూప్‌గానే..**

**అనంతపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్**

జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు.
ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# మండలంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పర్యటన

**అమడగూరు ఆగస్టు 5 అనంత. జనశక్తి.న్యూస్.**



అమడగూరు మండలం, జేకేపల్లి పంచాయతీలో ఈరోజు, పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పర్యటించనున్నారు అని మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి తెలియజేశారు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 6న అనగా ఈరోజు, అమడగూరు మండలంలోని జెకె పల్లి పంచాయతీలో ఉదయం 11 గంటలకు తెలుగుదేశం పార్టీ ఇంటింట ప్రచారం కార్యక్రమం మరియు రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ చేస్తున్నట్లు మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి తెలియజేశారు ఈ సందర్భంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు కుటమి నాయకులు పదవుల పొందినటువంటి కూటమి నాయకులు స్టోర్ డీలర్లు కాంట్రాక్టర్లు వివిధ సంఘాల నాయకులు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి తెలియజేశారు,

# నరసంబూది,మధుడిలో పొలం పిలుస్తుంది



**- ఎలనినో పరిస్థితులను గురించి రైతులకు అవగాహన**
**- పంటల బీమా ప్రతి రైతు తప్పనిసరిగా చేసుకోవాలి**

**అగలి ఆగస్టు 05 అనంత జనశక్తి న్యూస్:**

మండలంలో ఎలనినో పరిస్థితుల వల్ల పంటలను బెట్ట నుంచి రక్షించుకోవడం కోసం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. నరసంబుది, రామనపల్లి, కసాపురం మధుడి, గొల్లహట్టి గ్రామాలలో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తూ రైతులతో కలిసి రాగి,మొక్కజొన్న, వేరుశనగ,పత్తి, వక్క, మల్బరి పొలాలను సందర్శించి పొలాలలో పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు ప్రస్తుతం ఉన్న పంటలను రక్షక నీటి తడులిచ్చి ఆదుకోవాలని అదేవిధంగా పొటాషియం నైట్రేట్ 5 గ్రా లీటర్ నీటికి,లేదా 19:19:19, 10 గ్రా లీటరు నీటికి , లేదా యూరియా 20 గ్రా.లీ. నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే పంటను బెట్ట పరిస్థితి నుంచి 15 రోజుల నుంచి 20 రోజుల వరకు కాపాడుకోవచ్చని అలాగే రాబోయే వర్షాల ఆధారంగా ఖాళీగా ఉన్న భూములు, అదేవిధంగా బీడు భూములలో స్వల్పకాలిక రకాలైనటువంటి కొర్రలు, సజ్జలు,ఉలవలు ,పెసర,మినుము, అలసంద వంటి పంటలను వేసుకోవాలని అలాగే మొక్కజొన్న, రాగి, ఆముదం, వరి వేసుకున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా ఈ ఆగస్టు నెల 15వ తారీకు లోపు చేసుకోవాలని అలాగే ఈ పంట నమోదు కచ్చితంగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు,రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు



**- విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ....**

**ధర్మవరం ఆగష్టు 5 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మరణానంతరం కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే మహోన్నత సేవగా నిలిచిన నేత్రదానానికి ధర్మవరం చంద్రబాబు నగర్ కు చెందిన బుధరపు ఆదినారాయణ (59) సం, కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. గుండెపోటుతో బుధవారం ఆయన మృతి చెందగా, విశ్వదీప సేవా సంఘం సభ్యులు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు వెంటనే నేత్రదానానికి అంగీకరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని డీవై కుల్లాయప్ప కంటి కార్నియా రిట్రీవల్ సెంటర్ టెక్నీషియన్ జి. రాఘవేంద్ర మృతదేహం నుంచి కంటి కార్నియాలను విజయవంతంగా సేకరించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్న వారి కి చూపు ప్రసాదించే అవకాశం కలిగిందని సేవా సంఘం సభ్యులు తెలిపారు. నేత్రదానానికి సహకరించిన మృతుడి భార్య సరస్వతి, కుమారుడు తిరుమలేశు, కోడలు మౌనిక, అన్నలు బుధరపు బాలకృష్ణ, రామకృష్ణలకు విశ్వదీప సేవా సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వదీప సేవా సంఘం ఫౌండర్ కొళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్, ఉపాధ్యక్షుడు టి. చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జూజారు రఘు, గుద్దిటి ధనుంజయతో పాటు సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. "మరణానంతరం కూడా మరొకరికి వెలుగు ఇవ్వగలిగే గొప్ప దానం నేత్రదానం" అని సేవా సంఘం ప్రతినిధులు పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు గా జి. ముత్యాల గౌడ్ నియామకం

**ధర్మవరం ఆగస్టు 5, అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ ఆదేశాలు మేరకు మంత్రి కార్యాలయం ఇంచార్జి కగ్గోలు హరీష్ బాబు సమక్షంలో ధర్మవరం రూరల్ బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు గాం జి. ముత్యాల గౌడ్ ను నియమించారు.ఈ సందర్భంగా ముత్యాల గౌడ్ మాట్లాడుతూ.... బీజేపీ పార్టీ దేశానికి రక్షణ అని తనను ఎంపిక చేసిన మంత్రి సత్య కుమార్ బీజేపీ రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర మంత్రి కార్యాలయం ఇంచార్జి కగ్గోలు హరీష్ బాబు రమణ మూర్తి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరం నియోజకవర్గం వ్యాప్తంగా బీజేపీ పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలియజేసారు.



# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగం పెంచాలి

- బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం
- పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ అంకిత్




భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 5 (అనంత జనశక్తి):

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజుతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, చార్జిషీట్లు, కోర్టు విచారణ, బాధితులకు పరిహారం, పునరావాసం, పెండింగ్ కేసుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. 2014 నుంచి 2026 జూలై వరకు జిల్లాలో మొత్తం 1,104 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వాటిలో 196 కేసులు తప్పుడు కేసులుగా, 908 కేసులు నిజమైనవిగా నిర్ధారణ అయ్యాయని వెల్లడించారు. 859 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేయగా, 12 కేసుల్లో శిక్షలు నమోదయ్యాయి. 373 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదల కాగా, 472 కేసులు కోర్టు విచారణలో ఉన్నాయని, 49 కేసులు ప్రస్తుతం దర్యాప్తు దశలో కొనసాగుతున్నాయని వివరించారు. దర్యాప్తులో ఉన్న ప్రతి కేసును నాణ్యతతో, చట్టపరమైన గడువులోపు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, పునరావాసం, న్యాయ సహాయం, రక్షణ తదితర సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ పెండింగ్ కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, బాధితుల గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయిలో ఎస్సీ, ఎస్టీ హక్కులు, అత్యాచారాల నిరోధక చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును నిరంతరం పర్యవేక్షిస్తూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మూడు దశల పరిహార విధానం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదైన 949 కేసుల్లో 928 కేసులకు కలెక్టర్ ఆమోదం లభించగా, 823 కేసులకు పరిహారం మంజూరైందని, 105 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. చార్జిషీట్లు దాఖలైన 702 కేసుల్లో 580 కేసులకు పరిహారం అందగా, 122 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కోర్టు తీర్పు వెలువడిన ఏడు కేసుల్లో పరిహారం పూర్తిగా చెల్లించామని వెల్లడించారు. పోక్సో కేసులను కూడా అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేస్తూ బాధిత చిన్నారులకు వైద్య, న్యాయ, కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ హక్కులు, పోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బొల్లోజు అయోధ్య స్మారక స్తూపావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి

- ప్రజా చైతన్య యాత్రతో ప్రారంభం కానున్న అయోధ్య ప్రథమ వర్ధంతి సభ
- రామానుజవరంలో స్మారక సభ.. మణుగూరులో బైక్ ర్యాలీ, కార్నర్ మీటింగ్

మణుగూరు, ఆగస్టు 5 (అనంత జనశక్తి)

: సీపీఐ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, దివంగత ప్రజా నేత కామ్రేడ్ బొల్లోజు అయోధ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం (ఆగస్టు 6) రామానుజవరం గ్రామంలో స్మారక స్తూపావిష్కరణతో పాటు వర్ధంతి సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటలకు పినపాక మండలం బయ్యారం గ్రామం నుంచి ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమవుతుంది. అనంతరం ఉదయం 11 గంటలకు రామానుజవరంలో అయోధ్య స్మారక స్తూపావిష్కరణ కార్యక్రమం నిర్వహించి, వర్ధంతి సభ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు పాకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దబ్బాయి), పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూద్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావుతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజన విరామం అనంతరం సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీతో ప్రజా చైతన్య యాత్ర మణుగూరుకు చేరుకోనుంది. అక్కడ అంబేద్కర్ సెంటర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విస్తృతంగా కవర్ చేయడానికి ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు హాజరై సహకరించాలని నిర్వాహకులు కోరారు.

# ఓటరు జాబితా సవరణకు పార్టీల సహకారం అవసరం




- మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలు ధృవీకరించాలి
- 99.31 శాతం ప్రక్రియ పూర్తి: కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 5 (అనంత జనశక్తి)

: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీల సహకారం కీలకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, నివాసం మార్చుకున్న ఓటర్ల వివరాలను ధృవీకరించి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 9,96,198 మంది ఓటర్లలో 8,60,051 ఫారాలు (86.33%) డిజిటైజ్ కాగా, 1,29,263 ఫారాలు అన్‌కలెక్టబుల్‌గా నమోదయ్యాయని తెలిపారు. మొత్తం 99.31 శాతం ప్రక్రియ పూర్తై, కేవలం 6,884 ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అన్‌మ్యాప్డ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలని, ఏఎస్‌డీ, డీఎస్ఈ జాబితాలపై రాజకీయ పార్టీలు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణను కూడా గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని, అనంతరం విచారణ పూర్తి చేసి అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గడువు ముగిసిన మందులు.. అధికారులపై వేట

- మణుగూరు ఆసుపత్రి ఘటనపై కలెక్టర్ కఠిన చర్యలు
- ఫార్మసిస్ట్ సస్పెన్షన్.. నోటీసులు, బదిలీలు, సేవల నిలిపివేత

మణుగూరు, ఆగస్టు 5 (అనంత జనశక్తి)

: మణుగూరు ఏరియా ఆసుపత్రిలో గడువు ముగిసిన మందులను రోగులకు అందించిన ఘటనపై జిల్లా కలెక్టర్ అంకిత్ కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారితో విచారణ జరిపించి నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారణలో బాధ్యత నిర్ధారణ కావడంతో ఒక ఫార్మసిస్ట్‌ను సస్పెండ్ చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పాటు ఒక నర్సింగ్ అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరో సీనియర్ నర్సింగ్ అధికారిని చర్లకు బదిలీ చేయగా, విచారణ పూర్తయ్యే వరకు ఇద్దరు పేషెంట్ కేర్ సిబ్బంది సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల నాణ్యత, గడువు తేదీలు, పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో రాజీపడే వారిపై ఇకపై కూడా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

- సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన





భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 5 (అనంత జనశక్తి):

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, లోన్ యాప్‌లు, సోషల్ మీడియా మోసాలు, ఏపీకే ఫైళ్ల ద్వారా జరిగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అధిక లాభాలు, ఉద్యోగాలు, సినిమా అవకాశాల పేరుతో వచ్చే ఆఫర్లను నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కూడా విద్యార్థినులకు ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్, పోలీసు అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మన భూమి – అది మన హక్కు

- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- నాడు వైసీపీ పాలనలో మన రైతు పాసుపుస్తకాల పై జగన్ ఫోటో ముద్రింపు
- నేడు సీఎం చంద్రబాబు పాలనలో పాసుపుస్తకాలపై రైతు ఫోటోతో సహా ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ.
- పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి



ఓడి చెరువు ఆగస్టు 05 అనంత జనశక్తి న్యూస్

రైతుల హక్కులను పరిరక్షిస్తూ, భూ యాజమాన్యానికి మరింత భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఓడి చెరువు మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డబురువారిపల్లి, తిప్పేపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా 2,237 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పాటు రైతు ఫోటో ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆనాడు రైతుల పట్టాదారు పాసుపుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటోను ముద్రించి పంపిణీ చేశారని, అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు గౌరవాన్ని కాపాడే విధంగా రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ అధికారిక రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తోందని తెలిపారు. "మన భూమి - మన హక్కు" అనే భావనతో రైతులకు వారి భూ హక్కులపై పూర్తి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. నియోజవర్గం లో లక్ష కోట్లతో పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ ఏర్పాటు తో పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధి గేమ్ చెంజర్ గా మారడం ఖాయం అన్నారు. అదే విధంగా ఆమడ గూరు మండలంలో రూ.51వేల కోట్లతో అతి పెద్ద రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు తో ఈ ప్రాంత అభివృద్ధితో పాటు వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అతి త్వరలో ఓడి చెరువు కు మరో సోలార్ ప్రాజెక్టు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసి పిట్టా ఓబుల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, బోయపల్లి శివారెడ్డి, మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం, కంచి సురేష్, కూటమి నాయకులు మహిళా నాయకురాలు సుభాషిణి, డబురువారిపల్లి, తిప్పేపల్లి పంచాయతీ టీడీపీ కుటుంబ సభ్యులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో వేగవంతమైన పరిష్కారం...!




పెద్దాపురం, ఆగస్టు 5 : అనంత జనశక్తి న్యూస్

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా జడ్జి ఎన్ సరస్వతి అన్నారు. పెద్దాపురం కోర్టు ప్రాంగణంలో ఒక్క కిలోమీటర్ వాక్, బైక్ ర్యాలీ హైకోర్టు, జిల్లా కోర్టుల ఆదేశానుసారం బుధవారం నిర్వహించారు. పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి సరస్వతి ఆధ్వర్యంలో "మధ్యవర్తిత్వం (మీడియేషన్) 3.0" వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈరోజు పెద్దాపురం కోర్టు ఆవరణ నుండి 1కె వాక్, బైక్ ర్యాలీ కొనసాగింది.
ఈ ర్యాలీలో పాల్గొన్న సభ్యులందరూ "ప్రజలు లిటిగేషన్ వదిలి మధ్యవర్తిత్వాన్ని అనుసరించాలని", "రాజీ మార్గమే రాజ మార్గము" అనే నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సరస్వతి మాట్లాడుతూ
ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలలో మధ్యవర్తిత్వం (మీడియేషన్) అనేది అత్యంత ప్రధానమైనదన్నారు. దీని ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా తక్కువ ఖర్చు, సామరస్య పూర్వకమైన వాతావరణం, గోప్యత, అనుకూలత లభిస్తాయన్నారు.
కక్షిదారులందరూ ఈ మధ్యవర్తిత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో
డాక్టర్ కె. దీప దైవ కృప (సీనియర్ సివిల్ జడ్జి), ఎల్ దేవిరత్నకుమారి (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి), కె. శ్రీహరి (అదనపు జూనియర్ సివిల్ జడ్జి) టి సత్యనారాయణ (బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్) తో పాటు పలువురు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సోదరి మరిడమ్మకు వెంకటేశ్వర స్వామి "చీరా సారె"..!



## పెద్దాపురంలో ఆధ్యాత్మిక ఘట్టం

పెద్దాపురం, ఆగస్టు 5 :అనంత జనశక్తి న్యూస్

పెద్దాపురం పట్టణంలో బుధవారం ఒక ఆధ్యాత్మిక ఘట్టం కనువిందు చేసింది. సోదరి శ్రీ మరిడమ్మ అమ్మవారికి సోదరుడు అయిన శ్రీవేంకటేశ్వరుడు "చీరా సారె" సమర్పించారు. అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. అన్న చెల్లెళ్ళ అనుబంధానికి, దైవిక బంధానికి ప్రతీకగా నిలిచే ఈ మహోత్సవంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల చిన రాజప్ప, తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె జగదీశ్వర రావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మరిడమ్మ కి సమర్పించే చీరా సారె తో పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించి మరిడమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి సారెకు ఎదురెళ్ళి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వర ఆలయం నుంచి వచ్చిన సారె ను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులతో పాటు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# హైబీపీ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ఒక్క అలవాటు చాలా ముఖ్యం: వైద్యులు చెబుతున్న ముఖ్యమైన విషయం

ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో చాలామందిని వేధిస్తున్న సమస్యలలో రక్తపోటు (బీపీ) ఒకటి. ఈ సమస్యను అదుపులో ఉంచడానికి చాలామంది ఆహారం, వ్యాయామంపై మాత్రమే దృష్టి పెడతారు. కానీ, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంజయ్ భోజ్‌రాజ్ చెప్పిన ఒక కీలకమైన విషయం అందరినీ ఆలోచింపచేస్తోంది. బీపీ నియంత్రణకు ఆహారం, వ్యాయామంతో పాటు, ఒక అలవాటు కూడా అంతే ముఖ్యమని ఆయన చెబుతున్నారు. ఏంటది?



బీపీ నియంత్రణలో నిద్ర కీలక పాత్ర

బీపీ అదుపులో ఉండాలంటే నిద్రలో క్రమబద్ధత చాలా ముఖ్యం అని డాక్టర్ సంజయ్ భోజ్‌రాజ్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో చెప్పారు. క్రమం తప్పకుండా నిద్రపోవడం కష్టమైన పని అయినా, దాని వల్ల కలిగే ప్రయోజనాలు అపారమని ఆయన అన్నారు. 'బీపీ ఎక్కువగా ఉన్న ప్రతి ఒక్కరికీ నేను సిఫార్సు చేసే ఒకే ఒక్క ముఖ్యమైన అలవాటు ఇది' అని ఆయన స్పష్టం చేశారు. చాలామందికి బీపీ నియంత్రణ అంటే కేవలం ఆహారం, వ్యాయామం అని మాత్రమే తెలుసు. కానీ, మీ నిద్ర షెడ్యూల్ కూడా అంతే ముఖ్యమని ఆయన వివరించారు.

'ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోండి, ఒకే సమయానికి లేవండి'

'నేను సిఫార్సు చేసే నెం.1 అలవాటు ఇదే. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడానికి, ఒకే సమయానికి నిద్ర లేవడానికి ప్రయత్నించండి. సెలవు రోజుల్లో కూడా ఈ నియమాన్ని







పాటించండి. ఇది కష్టమని నాకు తెలుసు. కానీ ఎందుకు ఇది ముఖ్యం అంటే...' అని వివరిస్తూ దాని ప్రయోజనాలను ఇలా చెప్పారు.


సర్కాడియన్ రిథమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది: ఇది మన శరీర గడియారాన్ని క్రమబద్ధీకరించి, ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో, ఎప్పుడు మేల్కొలపాలో చెబుతుంది. కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది: రాత్రిపూట మన ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది: హార్ట్ రేట్ వేరియబిలిటీ ని మెరుగుపరుస్తుంది. రక్తపోటు నియంత్రణకు: ఇది బీపీని నియంత్రించడంలో సహాయపడుతుంది. 'నిద్ర అనేది ఎక్కువ సమయం ఉండటం కాదు, స్థిరంగా ఉండటమే ఇక్కడ ముఖ్యం' అని ఆయన అన్నారు. ఆ క్రమబద్ధత మీ శరీరానికి ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో, ఎప్పుడు మరమ్మత్తు చేసుకోవాలో, అలాగే రక్తపోటును ఎలా నియంత్రించాలో చెబుతుందని డాక్టర్ భోజ్‌రాజ్ తెలిపారు.

# టీనేజ్ అమ్మాయిల్లో కనిపించే పీసీఓఎస్ లక్షణాలు... తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేసే 5 ప్రధాన సంకేతాలు



పోలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది యువతులలో, ముఖ్యంగా టీనేజ్ అమ్మాయిలలో కనిపించే ఒక సాధారణ హార్మోన్ల సమస్య. ఈ సమస్యకు సంబంధించిన లక్షణాలను చాలామంది తల్లిదండ్రులు యుక్తవయసులో వచ్చే సాధారణ మార్పులుగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ నిర్లక్ష్యం వల్ల చికిత్స ఆలస్యమై, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

1. మొదటి కొన్ని సంవత్సరాల తర్వాత కూడా క్రమరహిత పీరియడ్స్



అమ్మాయిలకు రుతుస్రావం మొదలైన మొదటి ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పీరియడ్స్ క్రమరహితంగా ఉండటం సాధారణం. కానీ, ఈ సమయం దాటిన తర్వాత కూడా పీరియడ్స్ చాలా అరుదుగా, ఆలస్యంగా లేదా అస్సలు రాకపోతే అది PCOS లక్షణం కావచ్చు. చాలామంది తల్లిదండ్రులు ఇది ఒత్తిడి లేదా ఆహారపు అలవాట్ల వల్ల జరుగుతుందని భావించి, సరైన సమయంలో వైద్య సహాయం తీసుకోవడం ఆలస్యం చేస్తుంటారు.

2. సాధారణ చికిత్సకు స్పందించని మొండి మొటిమలు

టీనేజ్ వయసులో మొటిమలు రావడం సహజమే. కానీ, ముఖం, గడ్డం, ఛాతీ లేదా వీపుపై మొటిమలు వచ్చి, ఎన్ని క్రీములు వాడినా తగ్గకపోతే అది PCOS లక్షణం కావచ్చు. సాధారణ మొటిమలకు భిన్నంగా, PCOS వల్ల వచ్చే మొటిమలు చాలా మొండిగా, బాధాకరంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఆండ్రోజెన్ (పురుష హార్మోన్) స్థాయిలు పెరగడాన్ని సూచిస్తాయి.

3. శరీరంలో అధిక రోమాలు లేదా జుట్టు రాలడం

గడ్డం, పై పెదవి, ఛాతీ లేదా పొట్టపై అవాంఛిత రోమాలు పెరగడం హార్మోన్ల అసమతుల్యతకు స్పష్టమైన సంకేతం. అయినప్పటికీ, చాలామంది దీన్ని ఒక






సాధారణ సౌందర్య సమస్యగా భావించి పట్టించుకోరు. దీనికి విరుద్ధంగా, పురుషులలో కనిపించే పద్ధతిలో జుట్టు పలచబడటం లేదా అధికంగా రాలిపోవడం కూడా టీనేజ్ అమ్మాయిల్లోకు సంకేతం కావచ్చు. అమ్మాయిలకు రుతుస్రావం మొదలైన మొదటి ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పీరియడ్స్ క్రమరహితంగా ఉండటం సాధారణం. కానీ, ఈ సమయం దాటిన తర్వాత కూడా పీరియడ్స్ చాలా అరుదుగా, ఆలస్యంగా లేదా అస్సలు రాకపోతే అది లక్షణం కావచ్చు.

4. త్వరగా బరువు పెరగడం లేదా బరువు తగ్గడం కష్టం కావడం

PCOS ఉన్న చాలామంది అమ్మాయిలు సాధారణ ఆహారం తీసుకుని, వ్యాయామం చేసినా బరువు పెరగడం లేదా బరువు తగ్గడానికి చాలా ఇబ్బంది పడతారు. ఇది ఇన్సులిన్ రెసిస్టెన్స్ అనే కీలకమైన సమస్య వల్ల వస్తుంది. దీనిని చాలామంది తల్లిదండ్రులు కేవలం జీవనశైలి మార్పులుగా భావించి, దాని వెనుక ఉన్న హార్మోన్ల సమస్యను గుర్తించడంలో విఫలమవుతారు.

5. మూడ్ స్వింగ్స్, ఆత్మవిశ్వాసం తగ్గడం

మొటిమలు లేదా అవాంఛిత రోమాల వంటి కనిపించే లక్షణాల వల్ల PCOS ఉన్న టీనేజ్ అమ్మాయిలు తరచుగా మూడ్ స్వింగ్స్, ఆందోళన లేదా ఆత్మవిశ్వాసం తగ్గడం వంటి భావోద్వేగ సమస్యలను ఎదుర్కొంటారు. ఈ సమస్యలు శారీరక లక్షణాల వలెనే తీవ్రంగా ఉంటాయి. అయినప్పటికీ, వీటిని PCOSగా భావించరు. వైద్యులకు చూపించరు. వైద్యులను సంప్రదించడం వల్ల తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుంది.



# జనవరిలో 'మహారాణి' రాక?

పెద్దగా చదువుకోని ఓ మహిళ ప్రభుత్వ నాయకులతో తలపడాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఆమె జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనే కథాంశంతో రూపొందిన సిరీస్ 'మహారాణి'. బాలీవుడ్ నాయిక హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇటీవలే ఈ సిరీస్‌లో 'మహారాణి 5' రాబోతున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సిరీస్ చిత్రీకరణను ఈ నెల 6 నుంచి హ్యూమా ప్రారంభించనుందని, వచ్చే ఏడాది జనవరిలో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సిరీస్ బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో గృహిణి నుంచి శక్తిమంతమైన రాజకీయ నాయకురాలిగా మారిన రాణి భారతి పాత్రలో కనిపించనుంది హ్యూమా. ప్రస్తుతం ఆమె నటించిన 'టాక్సిక్' విడుదలకు సిద్ధంగా ఉంది.



# అప్పుడు సూర్య కంటే 3 రెట్లు ఎక్కువ సంపాదించా: జ్యోతిక

ఇండస్ట్రీలో క్యూట్ కపుల్ అనగానే గుర్తొచ్చేది సూర్య-జ్యోతికనే. సందర్భం వచ్చినప్పడల్లా వీరిద్దరూ తమ ప్రేమను తెలుపుతూనే ఉంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సూర్యతో తన బంధం, కెరీర్ ప్రారంభంలో ఉన్న పరిస్థితుల గురించి జ్యోతిక పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో సూర్య కంటే తానే ఎక్కువ సంపాదించినట్లు తెలిపారు. 'ఆ రోజుల్లో ఆయన పారితోషికం కంటే నా రెమ్యునరేషన్ మూడు రెట్లు ఎక్కువ. ఇప్పుడు అది 30 రెట్లు తగ్గింది' అని సరదాగా చెప్పారు.

"సూర్య ఒక నటుడిగానే కాకుండా భర్తగా చాలా గొప్ప వ్యక్తి. ఆయన మనసులో సమానత్వం మొదటి నుంచే ఉంది. అది సహజంగా పుట్టుకతోనే రావాలి. అమ్మాయిలకు వంట చేయడం రాకపోయినా.. ఏదైనా పని ఇష్టం లేదని చెప్పినా.. సరేనని వదిలేయడం అనేది సాధారణంగా మనం సినిమాల్లో చూస్తుంటాం కదా.. మా ఇంట్లో అచ్చం ఇలానే జరుగుతుంది. నేను ఫెమినిస్ట్‌గా మాట్లాడటం లేదు.. కానీ మా ఇంట్లో మేమిద్దరం సమానమే.



సినిమా నిర్మాణం నుంచి పిల్లల పెంపకం, సెలవుల్లో తిరగడం వరకు ప్రతి విషయంలోనూ మేం కలిసే నిర్ణయం తీసుకుంటాం. ఒకరి ఎదుగుదలను చూసి మరొకరం ఆనందించడమే మాకు అత్యంత ఇష్టమైన పని" అని ఆమె చెప్పారు. ఆఫ్‌స్క్రీన్, ఆన్‌స్క్రీన్‌లో హిట్ జోడీ అయిన సూర్య, జ్యోతిక తమిళంలో 'పూవెల్లం కేట్టుప్పార్' మొదలుకొని ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించి, మెప్పించారు. ఈ సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 2006 సెప్టెంబర్ 11న వివాహం చేసుకున్నారు.

# తొలగించకపోతే చర్యలు తప్పవు: మృణాల్ ఠాకూర్



కృత్రిమ మేధ(ఏఐ)ను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్ ఫేక్ ఫొటోలకు వ్యతిరేకంగా గళం విప్పారు హీరోయిన్ మృణాల్ ఠాకూర్. ఇప్పటికే నటీనటుల వ్యక్తిగత హక్కులను ఉల్లంఘిస్తూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఏఐ ఆధారిత ఫొటో ప్రచారాలపై పలువురు బాలీవుడ్ తారలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మృణాల్ తన ఫొటోలను ఉపయోగించి కంటెంట్‌ను సృష్టించి వాటిని డిజిటల్ మాధ్యమాల్లో ఉంచేవారికి హెచ్చరిక జారీ చేశారు. "నా డీప్‌ఫేక్ ఫొటోలను సృష్టించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవల్సి వస్తుంది" అని మృణాల్ ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు.

# 'బిగ్‌బాస్'.. క్రమశిక్షణ లేని ప్రవర్తనను అంగీకరించను: నాగార్జున



బుల్లితెర రియాలిటీ షో 'బిగ్‌బాస్' తెలుగు సీజన్-10 ముస్తాబవుతోంది. దీనికి సంబంధించిన ప్రోమో షూటింగ్‌ను టాలీవుడ్ అగ్రకథానాయకుడు నాగార్జున ఇటీవల పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన ముచ్చటించారు. బిగ్‌బాస్ విశేషాలతో పాటు తన 100వ చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు."ప్రోమో షూట్ చాలా బాగా జరిగింది. గత కొన్నేళ్లుగా నేను ఈ షోను హోస్ట్ చేస్తున్నా. ఇది పదో సీజన్ కావడంతో సరికొత్తగా, మరింత ఉన్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ఇతరుల ప్రవర్తనను నిర్ణయించడం, సూచనలు చేయడం నాకిష్టం ఉండదు. అందుకే మొదటి రెండు సీజన్లలో కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ఆ తర్వాత షో ఫార్మాట్ అలవాటైంది. గత సీజన్ సూపర్ హిట్ కావడంతో, ప్రేక్షకుల డిమాండ్ మేరకు ఈసారి ఫిజికల్ టాస్కులు మరింత కఠినంగా ఉండబోతున్నాయి. షోలో కంటెస్టెంట్లు హద్దులు దాటి, క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తే అస్సలు అంగీకరించను" అని నాగార్జున పేర్కొన్నారు. ఇక తన 100వ సినిమా గురించి నాగార్జున అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అభిమానుల ముందుకు తీసుకొస్తామని వెల్లడించారు.

# దేశవాళీలో విరాట్‌కు అదే తొలి టీ20..

## ఎన్ని పరుగులు చేశాడో తెలుసా?



ప్రపంచ క్రికెట్‌లో ఐపీఎల్ ఓ సంచలనం. అత్యుత్తమ ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చింది. అటు ఆటపరంగానూ.. ఇటు సంపాదనలోనూ బెస్ట్ అని తేలింది. 2008లో బీసీసీఐ తొలి ఐపీఎల్ సీజన్‌ను ప్రారంభించింది. అయితే, ఈ మెగా లీగ్‌ను తీసుకొచ్చే ముందు బీసీసీఐ ప్రయోగాత్మకంగా 2006-2007 సీజన్‌లో ఓ టీ20 టోర్నీని ప్రారంభించింది. అప్పుడు ఇంటర్ స్టేట్ టీ20గా పిలిచేవారు. తర్వాత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీగా నామకరణం చేశారు. అందులోనే విరాట్ కోహ్లీ తొలిసారి బరిలోకి దిగాడు. అప్పుడు అతడి వయసు కేవలం 18 ఏళ్లే.

### రెండో టాప్ స్కోరర్

విరాట్ కోహ్లీ ఇప్పుడు మైదానంలోకి అడుగు పెడితే అభిమానుల జోష్‌ను ఆపలేం. స్టేడియమంతా కిటకిటలాడాల్సిందే. కానీ, దాదాపు 19 ఏళ్ల కిందట మాత్రం పరిస్థితి భిన్నం. ఢిల్లీ తరపున హిమాచల్ ప్రదేశ్‌పై విరాట్ కోహ్లీ తొలి దేశవాళీ టీ20 మ్యాచ్ ఆడాడు. నాడు డొమిస్టిక్‌లోనే బెస్ట్ సీనియర్ బౌలర్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. అదీనూ పిచ్ బ్యాటింగ్‌కు కష్టమైన పరిస్థితుల్లో వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చాడు. 26 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఆ మ్యాచ్‌లో శిఖర్ ధావన్ (38) తర్వాత కోహ్లీనే టాప్ స్కోరర్. మిగతా బ్యాటర్లు చాలా ఇబ్బంది పడ్డారు. దీంతో ఢిల్లీ 136 పరుగులే చేయగలిగింది. అనంతరం లక్ష్య ఛేదనలో 19 ఓవర్లలోనే మూడు వికెట్లను కోల్పోయి హిమాచల్ విజయం సాధించింది.

ఇలా దేశవాళీలో విరాట్ తలపడిన మొదటి మ్యాచ్‌లోనే తన జట్టు ఓడిపోయింది. అయితే, అతడి ఆట మాత్రం ఆకట్టుకుంది. దీంతో 2008 ఐపీఎల్ (IPL) డ్రాఫ్ట్‌లోకి వచ్చే అవకాశం దక్కింది. ఢిల్లీ ఫ్రాంచైజీ స్థానిక కుర్రాడు కోహ్లీని కాదని ప్రదీప్ సంగ్వాన్ వైపు మొగ్గు చూపింది. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాత్రం కోహ్లీని డ్రాఫ్ట్ ధరకే సొంతం చేసుకుంది. ఆర్సీబీ తీసుకోవడానికి కారణం దేశవాళీలో కోహ్లీ ఆడిన తొలి టీ20 ప్రదర్శనతోపాటు అండర్ -19 వరల్డ్ కప్‌లో సారథ్య నైపుణ్యం ఆకట్టుకొని ఉండొచ్చు. ఐపీఎల్ ప్రారంభమైన ఏడాదే.. విరాట్ నేతృత్వంలో టీమ్ఇండియా అండర్-19 జట్టు వరల్డ్ కప్ సాధించిన సంగతి తెలిసిందే. ఇక వరుసగా 19 ఏళ్ల నుంచి కోహ్లీ బెంగళూరుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వరుసగా రెండు కప్పలను నెగ్గడంలో అతడు కీలక పాత్ర పోషించాడు.

# సీనియర్ ఆటగాళ్లను కాపాడుకోవాలి: అజింక్య రహానే

టెస్టు క్రికెట్ జట్టులో యువ ఆటగాళ్ల కంటే సీనియర్ ప్లేయర్లు ఎక్కువ మంది ఉండాలని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పలు విషయాల గురించి మాట్లాడాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ పూర్వ వైభవం పొందాలంటే ప్రస్తుతం ఉన్న సీనియర్ ఆటగాళ్లను జట్టులో కొనసాగించాలన్నాడు. సీనియర్లు ఒకేసారి ఆటకు దూరమవుతుండటం టీమ్ఇండియాకు సమస్యగా మారిందని 'జింక్స్' పేర్కొన్నాడు.

'గత రెండేళ్లుగా నేను టెస్టు క్రికెట్ ఆడకపోవడంతో ఇంట్లోనే కూర్చొని మ్యాచ్‌లు వీక్షించా. భారత జట్టు స్వదేశంలోనే మ్యాచ్‌లు ఓడిపోవడం కూడా చూశా. టెస్టు క్రికెట్ ఆడాలంటే పట్టుదల ఉండాలి. దాన్ని భారత ఆటగాళ్లు పెంపొందించుకుని పోటీతత్వంతో కూడిన క్రికెట్ ఆడాలి. ప్రతి సెషన్ పూర్తిగా ఆడాలి. చాలా జట్లు అలా చేయడం లేదు. నేను ఏ జట్టు గురించి ప్రత్యేకంగా చెప్పదల్చుకోలేదు. భారత టెస్టు క్రికెట్‌లోకి గత రెండేళ్లలో కొత్త ఆటగాళ్లు వచ్చారు. వారి సంగతి పక్కన పెట్టండి.

టెస్టు జట్టులో 7-8 మంది సీనియర్లు, ఇద్దరు లేదా ముగ్గురు యువ ఆటగాళ్లు ఉండాలనేది నా అభిప్రాయం. కానీ, ఇప్పుడు జట్టు కొత్త వాళ్లతో నిండిపోతోంది. దాదాపుగా సీనియర్ ఆటగాళ్లంతా రిటైర్ అయ్యారు. మిగిలిన అనుభవజ్ఞులైన ఆటగాళ్లను గౌరవించడం చాలా అవసరం. నిజం చెప్పాలంటే టెస్టు క్రికెట్ గురించి నాకు భయంగా ఉంది. ఇది మనుగడ సాగించాలని మనందరం కోరుకోవాలి. ముఖ్యంగా భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికాల్లో టెస్టు క్రికెట్ కొనసాగాలి" అని రహానే వివరించాడు.

గతేడాది రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా రహానే కూడా రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో సీనియర్ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం భారత జట్టులో రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే 50 కంటే ఎక్కువ టెస్టులు ఆడారు.



# ఒక్కడినే విమర్శించడం సరికాదు.. గంభీర్‌కు మద్దతుగా మాజీ చీఫ్ సెలక్టర్

గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా వచ్చినప్పటి నుంచి టీమ్ఇండియా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మంచి ఫలితాలే సాధిస్తోంది. టెస్టుల్లో మాత్రం పేలవ ప్రదర్శన చేస్తోంది. స్వదేశంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్‌ల్లో ఘోర ఓటములను మూటగట్టుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ తొమ్మిది మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు, నాలుగు ఓటములతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. గంభీర్ ఒంటెద్దు పోకడల వల్లే టెస్టుల్లో భారత్ పేలవ ప్రదర్శన చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్ గంభీర్‌కు అగ్నిపరీక్షగా మారింది. ఒకవేళ ఈ సిరీస్ కూడా కోల్పోతే అతనిపై వేటుపడే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి తరుణంలో గంభీర్‌కు మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్ మద్దతుగా నిలిచాడు. జట్టు వైఫల్యాన్ని ఒక్క వ్యక్తిపైనే మోపలేమన్నాడు.

"శ్రీలంక పర్యటన అందరికీ కీలకం. కేవలం గంభీర్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? అతను మంచి ఫలితాలు తేవడంలో విఫలమైతే ఆటగాళ్లు కూడా విఫలమైనట్లే. ఒక్కరినే విమర్శించడం సరికాదు. మన ఆటగాళ్లు స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. అందుకే న్యూజిలాండ్‌తో స్వదేశంలో సిరీస్ ఓడిపోయాం. అంతేకాకుండా కివీస్ ఆటగాళ్లు పూర్తి సన్నద్ధతతో ఇక్కడికి వచ్చారు. వారు స్పిన్‌కు అనుకూలమైన వికెట్లపై ప్రాక్టీస్ చేశారు. టీమ్ఇండియా మాత్రం బ్యాటింగ్, బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ప్రాక్టీస్ చేసింది. అదే భారత జట్టుకు ప్రతికూలంగా మారింది. అందుకే ఓటములను చవిచూసింది" అని సందీప్ పాటిల్ పేర్కొన్నాడు.

2007-2008 మధ్య టీమ్ఇండియాకు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించిన లాల్‌చంద్ రాజ్‌పుత్ కూడా గంభీర్‌కు అండగా నిలిచాడు. కోచ్ అన్నాక ఒడుదొడుకులు సహజమని, ప్రతిసారీ గెలవలేమని పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత జట్టు పరివర్తన దశలో ఉందని.. ఇలాంటి సమయంలో ఆటగాళ్లకు, కోచ్‌కు తగినంత సమయం ఇవ్వాలన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి దిగ్గజాలు రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకోవడం కూడా టీమ్ఇండియాపై ప్రభావం



చూపిస్తోందని లాల్‌చంద్ రాజ్‌పుత్ అన్నాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఇప్పటికే టీమ్ఇండియా శ్రీలంకకు చేరుకుంది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945